క్లుప్తంగా

మైనారిటీలకు అండగా వైఎస్సార్‌సీపీ



వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడిని కలిసిన మస్తాన్ బాషా

ద్వారకాతిరుమల: కూటమి పాలనలో మైనారిటీలకు రక్షణ లేదని, వారికి అండగా వైఎస్సార్ సీపీ ఉందని ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ మస్తాన్ బాషా అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మైనారిటీ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న మస్తాన్ బాషా, ఖాదర్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనారిటీల సమస్యలను ఖాదర్ బాషాకు వివరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ఖాదర్ భాషా అన్నారని మస్తాన్ బాషా తెలిపారు.

రేపు అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి వారికి ఈ నెల 2న స్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామి వారికి మండపారాధన, పుణ్యాహవచనం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, లక్ష్మిగణపతి హోమం చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

జంగారెడ్డిగూడెం డిపో నుంచి అరుణాచల యాత్ర

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10వ తేదిన గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని మేనేజర్ గంగాధర్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న రాత్రి 7 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి బస్సు బయలుదేరి 9వ తేదీ తెల్లవారు జామున శ్రీకాళహస్తి చేరుకొని అక్కడి నుంచి కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల మీదుగా అరుణాచలం చేరుతుందన్నారు. 10వ తేదీన పౌర్ణమి రోజు న దర్శన అనంతరం బయలుదేరి 11 ఉదయం జంగారెడ్డిగూడెం చేరుతుందన్నారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.2800 ఉంటుందని ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9959225489, 9491019105 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విలేకరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: తనకు వ్యతిరేకంగా అసత్య ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచురించారంటూ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాయింట్ ఈపేపర్ అనే ఇంగ్లిష్ పత్రికకు చెందిన విలేకరి పాదం వీరవెంకట సత్యనారాయణమూర్తిని అరెస్ట్ చేసినట్టు పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. విజయవాడలోని అశోక్‌నగర్‌కు చెందిన సత్యనారాయణమూర్తిని సోమవారం విజయవాడలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. అక్కడి నుంచి జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ చెప్పారు. కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు.

ట్రాఫిక్‌తో ప్రయాణికులు సతమతం

- చింతలపూడిలో ట్రాఫిక్ సమస్య జఠిలం
- పరిష్కరించాలని కోరుతున్న వాహనదారులు



చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో నిలిచిపోయిన వాహనాలు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. రోజు రోజుకీ పెరుగుతున్న ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, లారీలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. ముఖ్యంగా బోసుబొమ్మ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్లలో ట్రాఫిక్ తరచూ నిలిచిపోతోంది. దీనికి తోడు భారీ వాహనాలు. దీంతో వాహన దారులతో పాటు పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పార్కింగ్ ప్లేస్ లేక పోవడంతో పాత బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకూ ప్రధాన రహదారి పైనే ఆటోలు, జీపులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, లారీలు, స్కూటర్లు నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేస్తున్నారు.

రోడ్డుపైనే లోడింగ్, అన్‌లోడింగ్

ఇక దుకాణాదారులైతే లారీల్లో తమకు వచ్చిన సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ చేసేటప్పుడు తమకు ఇష్టమొచ్చిన రీతిలో వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక పోలీసులు వాహన యజమానులను, డ్రైవర్లను పలుమార్లు సమావేశ పరిచి సూచనలు చేసినప్పటికీ రెండు, మూడు రోజుల తరువాత పరిస్థితి యథాతథంగా ఉంటోంది. 2005లో పట్టణంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని రోడ్డును 66 అడుగులకు విస్తరించారు. డ్రెయినేజీ కూడా నిర్మించారు. కొద్ది కాలం తరువాత దుకాణాల యజమానులు డ్రెయినేజీలను దాటి రోడ్డు పైనే ముందుకు వచ్చి ఆక్రమించుకోవడమే కాక, చిరు వ్యాపారుల నుంచి రోజువారీ అద్దెలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చింది. ఆ తరువాత పెట్రోల్ బంకుల సమీపం నుంచి ఏలూరు, గురుభట్లగూడెం రోడ్డును కలుపుతూ పెద్ద చెరువు మీదుగా బైపాస్ రోడ్డును అభివృద్ధి చేశారు. ఏలూరు నుంచి వచ్చే వాహనాలను అటు వైపు మళ్లించే చర్యలు తీసుకున్నా సమస్య మాత్రం తీరలేదు. మళ్లీ ఏలూరు–మేడిశెట్టివారిపాలెం రోడ్డును విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలో విస్తరణ ఉంటుందని అంటున్నారు. అదే జరిగితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిస్తుంది.

ట్రాఫిక్ ఇబ్బందులు తీరేదెలా?



పట్టణంలో గతంలో రోడ్డు విస్తరణ చేసినా ట్రాఫిక్ ఇబ్బందులు తీరలేదు. పట్టణానికి వస్తే ఒక్కో సారి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పట్టణంలో పెరిగిన వాహనాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు పార్కింగ్ స్థలం కేటాయించాలి.

–మాగసాని గురుబ్రహ్మం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, బాలువారిగూడెం

పోడు భూములకు పట్టాలివ్వాలి

కుక్కునూరు: మండలంలోని అమరవరం అటవీ రేంజ్ పరిధిలో పోడు భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం అమరవరం అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అటవీరేంజ్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఆర్భాటంగా పాలక వర్గాలు చేస్తున్న ప్రచారం కాగితాలకే పరిమితమని ఆరోపించారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలివ్వడంలో పాలక వర్గాలు విఫలమైయ్యాయని విమర్శించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆదివాసీ గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి సత్యనారాయణ,సోయం చందర్‌రావు,కె కల్లయ్య, షేక్ మున్ని, ఎం మల్లేష్, మంగరాజు,రాజు, మచ్చ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం మండలంలోని తూర్పురేగులకుంట, అచ్చియ్యపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు తెల్లం చిన్నారావు అనారోగ్యంతో ఉన్నారని తెలిసి ఆయనను పరామర్శించారు. అలాగే చిన్నారావు ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయన ఆరోగ్యానికి సంబంధించిన వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఇటీవల దండిపూడి కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందిన యువకుల కుటుంబ సభ్యులను కూడా బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. గతంలో వేలేరుపాడు మండలంలో కాలువలో యువకుడు కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన జరిగిన సమయంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. అయితే దండిపూడి కాలువలో మృతి చెందిన గిరిజన యువకుల కుటుంబాలకు కూడా కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీ తెల్లం రమణ, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

ద్వారకాతిరుమల: మండలంలోని మహదేవపురం గ్రామంలోని రామాలయంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు రుద్రమూర్తి వేద మంత్రోచ్చరణల నడుమ చిన్నారులతో అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ధర్మ ప్రచారక్ ఉండ్రాజవరపు వెంకటరత్నం, పాతకోకల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు విద్యారంభం శుభప్రదంగా ఉండాలని, అలాగే భారతీయ సంస్కృతి పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యాదాత, సామాజిక వేత్త అంబటి శ్రీనివాసరావు, కంకిపాటి కృష్ణ, భీమడోలు సీత, గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం: గిరిజనుల సాగులో ఉన్న 1/70 చట్ట భూములను వివాదాల్లో ఉన్న భూములను అక్రమ పద్ధతిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి కింద సేకరిస్తున్నారని ఈ భూ సేకరణ తక్షణమే నిలుపుదల చేయాలని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు తెల్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాల్లో ఉన్న భూములను ఆర్అండ్ఆర్‌లో కొనుగోలు ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, గిరిజన సంఘం నాయకులు తలం దుర్గారావు, పోలోజు నాగేశ్వరావు, మడకం సుధారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, చుండ్రు బుల్లమ్మ, సీపీఎం నాయకులు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

నమో.. నారసింహ



నారసింహుని అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జగన్నాథుడు నారసింహుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో స్వామి వారు రోజుకో అలంకారంలో సాక్షాత్కరిస్తున్నారు. అందులో భాగంగా శంఖు చక్రాలను ధరించి, అమ్మవార్లతో ఆశీనులైన స్వామి వారి అలంకారం భక్తులకు కనువిందు చేసింది.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి.. కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఉన్న సమస్యల పరిష్కారానికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బత్తిన లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. కౌన్సిలర్ వలవల తాతాజీ, రమాదేవి తదితరులు మాట్లాడుతూ ఫైర్‌స్టేషన్ రోడ్డు నిర్మించాలని, ఇందిరానగర్‌లో పైపులైన్ ఏర్పాటు చేయాలని, శివాలయం వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే కంచెర్ల గీతాకుమారి, గొంతి మాధవ, ఎల్.వెంకటేశ్వరరావు, ఎస్.సుబ్బలక్ష్మి, పలు సమస్యలను లేవనెత్తారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ డంపింగ్ యార్డు కోసం భూమిని సేకరించాల్సి ఉందని, ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తానన్నారు. అప్పటి వరకు ప్రస్తుతం శివాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు రేకుతో వాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచెర్ల వాసవిరత్నం, సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KANCHERLA SITA MAHALAKSHMI W/o. Kancherla Naresh , Resident of D.No. 15-79/1, behind New Busstad, Jangareddygudem Town & Mandal, Eluru District. A.P. I Have changed my Name from **KANCHARLA SITA MAHALAKSHMI** W/o.KANCHARLA NARESH (OLD NAME) to **KANCHERLA SITA MAHA LAKSHMI** W/o. KANCHERLA NARESH (NEW NAME) for all purposes.

ఘనంగా స్కంధ పంచమి వేడుకలు



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి స్కంధ పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని శ్రీమదనగోపాల స్వామి వారి ఆలయ సన్నిధిలో ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఇరవై ఏడు లీటర్ల ఆవుపాలతో ఐదు కేజీల గులాబీ పూలతో అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పూజలు నిర్వహించారు. స్కంధ పంచమి పూజ చేయించుకునే వారికి నాగదోషం, కాలసర్ప దోషాలు, గ్రహ దోషాల నుంచి విముక్తి కలుగుతుందని అర్చకులు పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి మహాప్రభో..



ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

జంగారెడ్డిగూడెం: ఇంటి స్థలం కోసం ప్రభుత్వానికి, అధికారులకు ఎన్ని సార్లు దరఖాస్తు చేసినా నేటికీ మంజూరు చేయలేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అన్నారు. సోమవారం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని దళితులు, పేదలకు మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ శేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో ఎం.బాలరాజు, కె.సుబ్బారావు, జి.సూర్యకరం, ఎం.అశోక్ కుమార్, ఎం.సురేష్, దున్న ప్రసాదు, ఎం.కుమారి, ఎ.కాంతమ్మ, కె.భారతి, జి.మరియమ్మ, ఎస్.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రాజులకాలనీలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.22,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎమ్మార్పీఎస్ స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: ఎమ్మార్పీఎస్ స్థూప నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం రాజవరం గ్రామంలో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జులై 7న నిర్వహించనున్న నేపథ్యంలో జెండా స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య తెలిపారు. ఎమ్మార్పీఎస్ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తమిర్చి బ్రహ్మయ్య, కొడారి వంశీ, భీమాడోలు వెంకట్రావు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, తమిర్చి వీర్రాజు, ఏలేటి రాజు, ముప్పిడి శ్రీను, కృష్ణ, దేవరపల్లి వెంకటేష్, తమిర్చి శ్రీను, ప్రత్తిపాటి వెంకటేష్, కూనపాము ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.